# నరమేధం

**మల్లాది రవిశంకర్**




కోర్టురూమ్ నుంచి నిశ్శబ్దంగా బయటికి వచ్చేశాను. కిక్కిరిసిన కోర్టు రూమ్ నుండీ తీర్పుమీద వినిపిస్తున్న నిరసనలు నా చెవిన పడుతున్నా, నిర్లిప్తంగా బయటికి అడుగుపెట్టాను.

పాతిక సంవత్సరాలుగా వాయిదాలు పడుతున్న కేస్ హియరింగ్, ఫైనల్ వర్డిక్ట్ ఇంత దారుణంగా, న్యాయవ్యవస్థ మీద ప్రజలకున్న అపారమైన నమ్మకాన్ని చిన్నాభిన్నం చేస్తూ వచ్చింది.

గడిచిన పాతికేళ్ళలో నలిగిన ఎన్నో బ్రతుకుల మీద కనీస సానుభూతి కూడా లేకుండా వచ్చింది న్యాయనిర్ణయం. ఈ కేసులో మోసపోయిన వేలమందిలో నేనూ ఒక సామాన్య మానవుడ్ని. న్యాయవ్యవస్థనీ, న్యాయస్థానాన్నీ, న్యాయ నిర్ణయాన్నీ ప్రశ్నించలేని, దీని వెనకాల వున్న ఎన్నో కబంధ హస్తాల వంక కనీసం కన్నెత్తి కూడా చూడలేని ఒక మామూలు పౌరుడ్ని.

★ ★ ★

దేశంలో పెద్ద పేరున్న బహుళజాతి సంస్థ కర్మాగారం అది. కొన్ని వందల ఎకరాలలో విస్తరించి ఉంది ఆ కంపెనీ. చాలాదూరం నుండే కనిపించే పెద్ద పెద్ద పెద్ద కెమికల్ ట్యాంకర్లు, ఆకాశాన్నంటుతూ నిప్పులు బయటికి వెదజల్లే చిమ్నీలు. కంపెనీకి దగ్గరలోనే ఆధునిక సదుపాయాలతో కట్టిన పెద్ద కంపెనీ రెసిడెన్షియల్ కాలనీ. ఆ కంపెనీలో పనిచేస్తున్నాడంటేనే సహజంగా సంఘం గౌరవించేది.

ఆ కంపెనీ చుట్టుపక్కల దాని మీద ఆధారపడి నడిచే కొన్ని వందల యాన్సిలరీ యూనిట్స్. ప్రభుత్వానికి ఆ ఏరియా నుండే కొన్ని వందల కోట్లు పన్నుల రూపంగా వచ్చేవి. ఆ కంపెనీ తయారుచేసే కెమికల్స్ దాదాపుగా ఎక్స్‌పోర్ట్ అయ్యేవి.

అందుకే....అందరూ సంతోషమే.

ఈ కంపెనీ దేశప్రగతికి రథచక్రం అనేవారు నేతలు.

అమ్మలాగా అన్నం పెట్టే అన్నదాత అని కూడా అనేవారు.

★ ★ ★

రాఘవ్ కూతురి పెళ్ళి ఏర్పాట్లు చాలా ఘనంగా జరిపిస్తున్నాడు. పాతిక సంవత్సరాల క్రితం ఈ కంపెనీలో చేరిన రాఘవ్ దాదాపుగా ఇక్కడే సెటిల్ అవటంతో, పెళ్ళి కూడా కాలనీలోనే జరిపిస్తున్నాడు. ఏ ఇబ్బందీ లేకపోవటంతో కాలనీలో పెళ్ళిళ్ళు జరగటం చాలా కామన్.

పెళ్ళికొడుకు అమెరికాలో ఉద్యోగం. పెళ్ళివారిని రిసీవ్ చేసుకోవడానికి రెండు బస్సులు స్టేషన్‌కి వెళ్ళాయి. కమ్యూనిటీ హాల్లో పెళ్ళి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. పెళ్ళి మంటపం డెకరేషన్ చకచకా నడుస్తోంది. ఉత్తరాదీ, దక్షిణాదీ వంటకాలు కంపెనీ కేటరర్స్‌తో చెప్పి మరీ చేయిస్తున్నాడు రాఘవ.

రాఘవ్‌కి సంతోషంగా ఉంది. సంతృప్తిగా ఉంది. రంగరంగ వైభోగంగా పెళ్ళి జరిపించాడని తన బంధుకోటికంతా తెలియాలని ఎవర్నీ విడవకుండా అందరికీ ఆహ్వానాలు పంపించాడు.

పెళ్ళివారి బస్సులు కాలనీలోకి వస్తూనే, వాళ్ళల్లో చాలామంది మరో ప్రపంచలోకి అడుగుపెట్టినట్టుగా ఫీల్ అయ్యారు. వాళ్ళ ముఖాల్లో వెలుగు, ఈ పెళ్ళిరూపంగా అయినా ఈ ప్రాంతాన్నీ, ఈ కాలనీని చూడచ్చన్నట్టుగా అనుకున్నదానికంటే ఎక్కువమందే వచ్చారు.

పెళ్ళి ఏర్పాట్లని చూసి పెళ్ళివారు సంతృప్తిపడటమే కాక భళీ అంటుంటే రాఘవ్ ఆనందానికి అంతే లేదు. తన కూతురుకి అత్తింట్లో మాటరాదని గర్వంగా ఉంది రాఘవ్‌కి. పెళ్ళి తెల్లారి మూడుగంటలకి కావటంతో అంతా భోజనాలు ముగించుకొని నిద్ర కుపక్రమించారు.

దూరంగా నిప్పులు కక్కుతున్న కంపెనీ చిమ్నీ వంక కృతజ్ఞతా భావంతో చూశాడు రాఘవ్. ఇంత గౌరవాన్నిచ్చిందీ నువ్వేకదా అన్నట్టు.

★ ★ ★

'రామ్‌దాస్‌పాండా' చెప్పలేని ఆనందంగా ఉన్నాడు. ఎక్కడో వేరే రాష్ట్రం నుండీ పొట్టచేత పట్టుకొని వచ్చి, కొంతకాలం రోజు కూలీమీద పనిచేసి, అలా అలా అంచెలంచెలుగా ఎదిగి ఈరోజు అసిస్టెంట్ మేనేజర్ అయ్యాడు.

అతని అంతులేని ఆనందానికి కారణం కూతురికి ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లో మంచి ర్యాంక్ వచ్చింది. తన పేరు, ఆమె పేరూ కంపెనీ అంతా మారుమ్రోగిపోయింది. జనరల్ మేనేజర్ కూడా పిల్చి కంగ్రాట్యులేట్ చేశాడు.

శరీర కష్టాన్ని నమ్ముకొని వచ్చిన తన జీవితంలో ఇంతటి మార్పు. తన పిల్లలు తనకంటే పైపైకి ఎదుగుతున్నారనే సంతృప్తి.

ఒక్కసారి తను పుట్టి పెరిగిన పల్లెని గుర్తు తెచ్చుకున్నాడు పాండా.

బీట్లు వారుతున్న నేల, వర్షం చుక్కకోసం ఆశగా ఎదురుచూసే ఎందరో నేలని నమ్ముకున్న రైతులు. పేదరికం. ఆకలిచావులు..ఆకలి కేకలు..రోగాలు..దరిద్రం..మండే ఎండలు..ఎండి జీవం లేని ముళ్ళకంపలు.

అక్కడినుండే తెలివితెచ్చుకొని బయటపడి జీవన పోరాటం కోసం ఈ ప్రాంతం చేరుకున్నాడు.

ఈ మధ్య తన ఊరు వెళ్ళినప్పుడు చూశాడు అతను. ఆ పరిస్థితుల్లో పెద్దగా మార్పేమీ రాలేదు. అయినా ప్రజలు అలాగే బ్రతుకుతున్నారు.

కనీసం ఒక పదిమంది స్నేహితులు తనని వచ్చి కలిసి, వాళ్ళ పిల్లలకి ఉద్యోగం వేయించమని అభ్యర్థించారు.

ఒక ఏమీలేని తనలాంటి వాడికి ఇంత ఇచ్చిందీ కంపెనీ.


ఉజ్వలిస్తున్న ఫ్యాక్టరీ చిమ్నీ రామ్‌దాస్ పాండాకి భవిష్యత్తుమీద క్రొత్త ఆశ కలిగిస్తోంది.

★ ★ ★

డాక్టర్ సోమయాజి ఇంటి బయట లాన్‌మీద పడుకొని ఆకాశంలోకి చూస్తున్నాడు. పౌర్ణమి చందమామలో నల్లని మచ్చలే అతనికి ప్రస్ఫుటంగా అగుపిస్తున్నాయి.

డాక్టర్ యాజీ కంపెనీ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ హెడ్. అవసరమైతే దేవుడ్ని కూడా లెక్కచెయ్యడు అతను. అభిప్రాయాన్ని నిక్కచ్చిగా వ్యక్తంచేసే అతనికి, టాప్‌మేనేజ్‌మెంట్లో మిత్రులకంటే, శత్రువులే ఎక్కువమందున్నారు.

క్రితం ఏడాది కంపెనీ సిఇఓ అతన్ని అమెరికా పిలి



పించుకున్నాడు. అతనితోపాటుగా కంపెనీ జనరల్ మేనేజర్నీ, కంట్రీమేనేజర్నీ కూడా పిలిపించాడు.

అక్కడి మీటింగ్ సారాంశం:

అభివృద్ధి చెందిన దేశాలు తయారీని నిషేధించిన కొన్ని కెమికల్స్‌ని, తమ ప్లాంట్‌లో తయారుచెయ్యాలనే ప్రపోజల్. ఒకసారి తయారీ పూర్తికాగానే వాటిని అమెరికాకి ఎగుమతి చెయ్యాలనీ, ఇది ఒక పెద్ద బిజినెస్ అవకాశం అని సిఇఓ అన్నాడు.

డాక్టర్ యాజీ, ఆ ప్రపోజల్‌ని అపోజ్ చేశాడు.

ఆ కెమికల్స్ తయారీవల్ల పర్యావరణ, జలకాలుష్యాలు వస్తాయనీ, దాని తయారీలోవచ్చే విషవాయువులు ప్రాణికోటికి హానికరమనీ, ఆ ప్రపోజల్ తమ ప్లాంట్‌కీ దేశానికీ కూడా మంచిది కాదన్నాడు యాజీ.

సిఇఓ, డాక్టర్ యాజీ వాదనకి కొంత కన్విన్స్ అవుతున్న తరుణంలో జనరల్ మేనేజర్ ఆ కెమికల్స్ తమ ప్లాంట్‌లో తయారుచేస్తామని ముందుకొచ్చాడు. కంట్రీ మేనేజర్ ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్, పొలిటికల్ లాబీయింగ్ తను చూసుకుంటానన్నాడు.

సిఇఓ వెంటనే ఓ.కే. అనేశాడు.

చాలా తక్కువ కాలంలోనే కావల్సిన ఏర్పాట్లన్నీ జరిగి పోవాలనీ, ఒకసారి ప్రొడక్షన్ మొదలవంగానే లోకల్ మేనేజ్‌మెంట్‌లో ఛేంజస్ వస్తాయనీ, ఆ మాట వినంగానే జనరల్ మేనేజర్, కంట్రీమేనేజర్ ముఖాలు వెలిగిపోయాయి.

సిఇఓ వర్కర్స్ అందరికీ ఆరునెలల జీతం బోనస్‌గా వెంటనే ఎనౌన్స్ చెయ్యమని చెప్పాడు. ఆ తర్వాత యాజీ ఏమి చెప్పినా సిఇఓ అంత పట్టించుకోలేదు. పొలిటికల్ లీడర్స్‌ని కలవాలంటే ఒకసారి తనూ ఇండియా వస్తానన్నాడు. ఆ తర్వాత జరిగిన రెండు మీటింగ్స్‌కీ డాక్టర్ యాజీకి పిలుపు రాలేదు.

ఆ తర్వాత పనులు చాలా చకచకా జరిగిపోయాయి. ఆ కెమికల్స్ తయారీలో వచ్చే విషవాయువులు స్టోర్ చెయ్యటానికి భూగర్భంలో కట్టిన ట్యాంకర్స్‌ని టెంపరరీగా ఏర్పాటుచేశారు. ఆ తర్వాత వాటి డిస్పోజల్ గురించి ఆలోచిద్దాం అనుకున్నారు. కెమికల్స్ తయారీ తర్వాత ఉత్పన్నమైన నీటిని పైప్‌లైన్స్ ద్వారా దగ్గరలో ప్రవహించే నదిలో కలిపేశారు. వీటన్నిటికీ పర్యావరణ శాఖ ఆమోదం దొరికింది. సిఇఓ ఇండియావచ్చి కలవాల్సిన నేతలని కలిసి వెళ్ళాడు.

జరుగుతున్న తంతుని డాక్టర్ యాజీ నిర్లిప్తంగా గమనిస్తున్నాడు.

డాక్టర్ యాజీ కళ్ళు మండుతున్న ఫ్యాక్టరీ చిమ్నీని గమనిస్తున్నాయి ఇప్పుడు.

చిమ్నీకి చాలాదూరంగా ఒక పక్షుల గుంపు ఎగురుతూ వస్తోంది. వాటినే గమనిస్తున్నాడు యాజీ. దూరంగా ఎగురుతున్న పక్షుల్లో ఒకటి ఒక్కసారిగా టప్పున కిందపడిపోయింది. అటుగా ఎగురుతున్న మిగతా పక్షులు చిమ్నీని దూరంనుండే దాటేశాయి.

కానీ..వాటి గమన వేగంలో ఏదో మార్పు. ఎగరటానికి కష్టపడుతున్నట్టనిపించింది. డాక్టర్ యాజీ భృకుటి ముడిపడింది.

* * *

'శ్రియా క్లినిక్' డైరెక్టర్ డాక్టర్ మెహతా నుదిటి మీద చెమటలు పట్టాయ్. గత నెలరోజుల్లో హాస్పిటల్లో జరిగిన రెండు వందల కాన్పుల్లో, యాభై ఏడుమంది పోలియోతో పుట్టారు. మిగిలిన వారిలో దాదాపు ఎనభైమంది లంగ్స్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. మిగిలినవారిలో మూడొంతులమంది పిల్లల్లో వైట్ బ్లడ్ సెల్స్ ఉండాల్సిన మోతాదుకంటే చాలా తక్కువగా ఉండటంతో లో రెసిస్టెన్స్ పవర్‌తో బాధపడుతున్నారు.

ఇంతకాలం ఆరోగ్యంగా, ఆనందంగా తల్లీపిల్లలు డిస్చార్జ్ అయ్యేవాళ్ళు డెలివరీ తర్వాత కానీ ఇప్పుడు...

డెలివరీ అయిన మూడు, నాలుగు వారాలు తర్వాతైనా తల్లినీ, పిల్లల్నీ డిస్చార్జ్ చెయ్యలేని నిస్సహాయత.

అప్పటికీ ప్రీ అండ్ పోస్ట్ డెలివరీ కేర్ బాగా తీసుకుంటుంది హాస్పిటల్. ఇంతకాలం ఈ హాస్పిటల్స్‌కి ఉన్న ఇమేజ్ ఇప్పుడు పోతోందేమోననే అనుమానం. కొంతమంది పేషెంట్స్ దగ్గర్లో ఉన్న పెద్దసిటీకి వెళుతున్నారు.

పుట్టిన పిల్లల్ని చూసుకొని -

"ఎందుకు డాక్టర్ బేబీ ఇలా పుట్టింది?" అని గుడ్ల నీళ్ళు కుక్కుకుంటూ మదర్స్ ప్రశ్నిస్తుంటే-

వాళ్ళని చూడలేని, ఏమీ చెయ్యలేని నిస్సహాయత.

ఈ ప్రాంత వాటర్ కంటామినేట్ అవుతున్నాయా? అనే అనుమానం. రేపే కంపెనీ ఆర్ అండ్ డి హెడ్ డాక్టర్ యాజీతో ఈ విషయం డిస్కస్ చెయ్యాలనుకున్నాడు డాక్టర్ మెహతా.

హాస్పిటల్ టెర్రస్ మీద అసహనంగా పచార్లు చేస్తున్న డాక్టర్ మెహతా దృష్టి దూరంగా మండుతున్న కంపెనీ చిమ్నీమీద పడింది. ఆ క్షణం అతనికి ఎందుకో అది కొరివి దెయ్యంలాగా అనిపించింది.

అతని దృష్టి దూరంగా ఎగురుతున్న పక్షుల మీద పడింది.

ఒక పక్షి నేలకూలటం, మిగతా పక్షులు ఇబ్బందిగా ఎగరడం డాక్టర్ మెహతా దృష్టినీ దాటి పోలేదు.

* * *

ఇలా ఎందరో జీవనయాత్రలతో ముడిబడ్డ ఆ కాలనీలో రోజూలాగానే ఆ రోజూ తెల తెల వారింది. మేలుకొలుపులు పాడే రంగు రంగుల పక్షుల గళాలు మూగబోయాయి. దూరం నుండే ఒక పక్షి బాధతో వికృతంగా అరుస్తోంది.

ఇంతకాలం అప్పటికే చైతన్యాన్ని పుంజుకునే కాలనీ రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి.

గడచిన అర్ధరాత్రి కంపెనీ పైప్‌లైన్స్ నుండీ లీక్ అయిన విషవాయువు గాలిలో కలిసింది.

నిద్రపోతున్న పెళ్ళివారు ముహూర్తం దాటిపోతున్నా నిద్ర లేవలేదు. కలలుకంటూ ఏ రెండు జాములకో కంటి కునుకు పట్టిన వధూవరుల బ్రతుకు కలలు కంచికి చేరాయి.

చదువుకుంటానని ముందుకొచ్చిన చిన్నారి పాండా పుస్తకాల మధ్య కునుకు తీస్తూ, ఆ కునుకులోనే ఆఖరి శ్వాసను విడిచేసింది విషవాయువులు పీల్చి.

ప్రమాదం గమనించిన ఇద్దరు డాక్టర్లూ కూడా చరిత్రలో కలిసిపోయారు.

ఒకరు కాదు, ఇద్దరు కాదు ఇరవై వేలమంది ఈ దేశ పౌరులు బాధ్యతారహితంగా ప్రవర్తించిన ఒక కంపెనీ కబంధహస్తాలలో పడి ప్రాణాలు పోగొట్టుకున్నారు.

మొసలి కన్నీటితో నేతలెందరో ప్రజలముందుకొచ్చారు. నిన్నటిదాకా ఈ కంపెనీ ప్రగతిరథ చక్రం అన్నవారే, ఇది ఒక విషవృక్షం అని మాట మార్చేశారు. ఏదో ప్రజలకి చేసేస్తాం అంటూ బాసలు చేశారు.

కేలండర్ కాగితాలు గాలికి రెపరెపలాడుతూ పాతిక సంవత్సరాలు గడిచిపోయాయి.

బ్రతికి బయటపడ్డ కొంతమందికి పుట్టినపిల్లలు కుంటివారిగా, గుడ్డివారిగా పుట్టి, తాము పోగొట్టుకున్న బంగారు భవిష్యత్తుకు ప్రతిఫలం కోసం ఎక్కే కోర్టూ, దిగే కోర్టూ.

ఇంతకాలంలో ఆ కేసు, ఫైళ్ళమధ్య నాని కుళ్ళిపోయింది.

ఈ పాతికేళ్ళ కాలంలో పార్టీలు మారాయి. ప్రభుత్వాలు మారాయి. నేతలు మారారు. కానీ బండలయిన ఇక్కడి ప్రజల జీవచ్ఛవంలాంటి బ్రతుకులు మారలేదు.

చివరికి ఈ రోజు వచ్చిన జడ్జిమెంట్ ప్రకారం-

ఎనభై ఏళ్ళ వయసుకి చేరుకున్న నలుగుర్ని దీనికంతటికీ బాధ్యుల్ని చేస్తూ నాలుగేళ్ళ జైలు శిక్షా..పాతిక వేల జరిమానా విధించింది.


వీళ్ళంతా దేశప్రగతికి చీడపురుగులనేసింది.

ఆ ప్రాంతం నుండి పుట్టి కెవ్వుమనే ప్రతి పసికందూ ఇంకా ఏదో అవకరాలతోనే పుడుతోంది. ఆ ప్రాంతంలో పుట్టినందుకు జీవితకాలం బాధపడాలనుకుంటూ.

ఇంత ప్రమాదకరమైన కెమికల్స్ తయారీ ఇక్కడ జరపాలని నిర్ణయించుకున్న ఆ బహుళ జాతి కంపెనీని ప్రశ్నించాలా?

దాని ఉత్పత్తికి క్లియరెన్స్ ఇచ్చిన ఈ దేశ పర్యావరణ శాఖని ప్రశ్నించాలా?

ఈ నరమేధాన్ని తేలిగ్గా కొట్టేసిన న్యాయవ్యవస్థని ఈ దేశ అసమర్ధ సగటు మనిషి ప్రశ్నించాలా? ఎవర్ని ఎవరు ప్రశ్నించాలి?



# ఐదు పాత్రలు

**కమల్‌హాసన్ 'దశావతారం'లో పది పాత్రలు పోషించి సంచలనం సృష్టించాడు. బహుశా ఆ ఇన్స్పిరేషన్‌తోనే ఏమో ఇప్పుడు యాక్షన్ కింగ్ అర్జున్ ఐదు పాత్రలు ధరిస్తున్నాడు. 'వెల్లాకొట్టయ్' అనే యాక్షన్ ప్యాక్డ్ సినిమాలో ఐదు విభిన్న తరహా వేషాలు వేసి ప్రేక్షకుల్ని అలరించబోతున్నాడు. కమల్ 'దశావతారం' బాగుంది అనిపించుకున్నప్పటికీ కమర్షియల్‌గా పెద్ద హిట్ కాలేదు. మరి అర్జున్ ఐదు పాత్రల 'వెల్లాకొట్టయ్' ఎలాంటి విజయం సాధిస్తుందో! ఈ తమిళ చిత్రం తెలుగులోకి ఎలాగూ అనువాదం అవుతుంది కదా!**